ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు అత్యాశే..

బడ్జెట్‌లో విద్యాశాఖకు పది శాతం కూడా నిధులు కేటాయించకపోవడం బాధాకరం. రూ.3,04,965 కోట్ల తెలంగాణ బడ్జెట్‌లో ప్రభుత్వం విద్య కోసం కేవలం రూ.23,108 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయనడం హాస్యాస్పదంగా ఉన్నది. అలాగే, ఈ అరకొర బడ్జెట్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు కూడా అత్యాశగానే మిగిలిపోతుంది. పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను అందించాలంటే ప్రస్తుతమున్న సర్కార్ బడులను మరింత మెరుగుపర్చి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది. **- రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్‌టీయూ, రంగారెడ్డి**

హామీలకు ఎగనామం.. ప్రజలకు పంగనామం

అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పంగనామాలు పెట్టింది. ప్రజలకు ఇచ్చిన హామీలకు ఎగనామం పెట్టి నిలువునా వంచించింది. గతేడాది బడ్జెట్‌లో పెట్టిన నిధుల్లో రూ.70 వేల కోట్లు గ్యాప్ వచ్చిందని చెప్పిన ప్రభుత్వం ఈ ఏడాది అంతకు మించి అంకెల గారడీ చేయడం సిగ్గుచేటు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ వాస్తవికతకు చాలా దూరంగా ఉన్నది. అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికొదిలేసి అయినవారికి దోచిపెట్టడానికి మాత్రమే బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. వ్యవసాయానికి కేవలం రూ.24 వేల కోట్లు కేటాయించడంతో రైతు భరోసా సగం మందికి ఎగ్గొట్టడం ఖాయమైంది. ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఊసెత్తకపోవడం, నాలుగు వేల నిరుద్యోగ భృతి, ఐదు లక్షల విద్యాభరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు, విదేశీ విద్యా పథకానికి నిధులు కేటాయించకపోవడం యువతను మోసం చేయడమే. ప్రతి దళిత కుటుంబానికి అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి రూ.12 కూడా బడ్జెట్‌లో పెట్టలేదు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను చైతన్యవంతం చేస్తాం. **- సత్తు వెంకటరమణారెడ్డి, గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్, తుర్కయాంజాల్**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చినట్లు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వలేదని, పింఛన్‌ను అందజేయడం లేదనే విషయమై శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, పలువురు సభ్యులు బుధవారం ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. **- తుర్కయంజాల్, మార్చి 19**

వంద శాతం లక్ష్యాలు సాధించాలి

- వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలి..
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- బ్యాంక్ మేనేజర్లతో సమీక్ష

బ్యాంక్ మేనేజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, మార్చి 19 : వంద శాతం లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు కృషి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో చిన్న వ్యాపారులు, మధ్యతరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని ప్రోత్సహించేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు ఎంఎస్ఎంఈ ద్వారా అధికంగా రుణాలను అందించాలని వివిధ బ్యాంకు అధికారులకు సూచించారు. ఖరీఫ్, రబీకి సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే రానున్న సీజన్‌లో రైతంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాలు సాధించే వరకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.

సకాలంలో రుణాలు అందించాలి

ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తున్నాయని, మరికొన్ని వెనుకంజలో ఉండిపోతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అంశాలపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ.. వ్యవసాయశాఖతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు.

పనులు వేగవంతం చేయాలి

ఎస్‌హెచ్‌జీ గ్రూపుల యూనిట్ల గ్రౌండింగ్‌లో జాప్యం జరుగుతుందని కలెక్టర్ దృష్టికి రావడంతో వెంటనే కలెక్టర్ స్పందిస్తూ వెంటనే పనులు వేగవంతం చేయాలని సూచించారు. విద్యా రుణాలు, గృహ నిర్మాణాల రుణాలు తక్కువగా ఇచ్చిన బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. మెప్మా ద్వారా స్వయం ఉపాధి కల్పించే పథకాలను, బ్యాంక్ లింకేజీ రుణాలను కూడా త్వరితగతినా గ్రౌండ్ అయ్యేలా చూడాలని బ్యాంకర్లకు తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ.. ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ ఆధారంగా అన్నీ బ్యాంకులు తమ పరిధిలో పంట రుణాలను అధికంగా ఇవ్వడంతో పాటు మనీ లెండర్ల వద్ద రైతులు రుణాలు తీసుకుంటే వారికి వెంటనే బ్యాంకు రుణాలు అందించి మనీ లెండర్ల నుంచి రైతులను కాపాడాలని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కుసుమ, నాబార్డు ఏజీఎం, వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరి. వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

- రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా మారింది
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్/ఆమనగల్లు, మార్చి 19 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో ఆచరణకు సాధ్యం కాని 420 హామీలనిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ... అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయడానికి ఆపసోపాలు పడుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా మారిందని ఎద్దేవా చేశారు. 2024-25 బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.9 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, వాటిలో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండానే 2025-26లో బీసీల సంక్షేమానికి రూ.11 వేల కోట్లు కేటాస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. అలవి గానీ హామీలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ... హామీలను అమలు చేయడానికి నిధులు లేవని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, వృద్ధులు, వితంతవులు, విద్యకు స్పష్టమైన కేటాయింపులు జరగలేదని తెలిపారు. కుల, చేతి వృత్తులకు బడ్జెట్‌లో ప్రభుత్వం మొండి చేయి చూపించిందన్నారు. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయాన్ని ఆదుకునేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించడం లేదని ఆరోపించారు. పూర్తి స్థాయిలో వేసవి రాక ముందే గ్రామాలు, తండాల్లో నీటి సమస్యలు మొదలైన్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు మేలు కాకుండా, ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు డబ్బులు మోసే గులాంగిరిలా ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కమీషన్ల కోసం వెంపర్లాడుతున్నదని విమర్శించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లోని సామాన్య, పేద ప్రజలను భయభ్రాంతులకు గుర్తి చేస్తున్నదన్నారు. ఎస్ఎల్‌బీసీలో జరిగిన ఘటనపై ప్రభుత్వం ఎలాంటి వివరణ, చర్చ జరపకపోవడం బాధకరమని ఆయన పేర్కొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 19 : ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిదులతో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. మీసేవ, ఆన్‌లైన్ , హెల్ప్ లైన్, మొబైల్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫారం 7 ద్వారా మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. అలాగే ఫారం 8 ద్వారా ఓటరు బదిలీ, పోలింగ్ కేంద్రం బదిలీ చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చుకోవడం, ఓటరు ఐడీలో మార్పులు చేసుకోవచ్చన్నారు. బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం వారం రోజుల్లోగా చేపటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబితాలను పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఏల మొబైల్ నంబర్‌తో సహా తహసీల్దార్లు లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి జిల్లా పార్టీల అధ్యక్షుల సంతకాలతో సమర్పించాలన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ ఉష్యా నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- విద్యుత్, తాగునీరు ఉండేలా చూసుకోవాలి
- అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో పదో తరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి గతంలో జరిగిన పొరపాట్లకు ఏమాత్రం తావివ్వకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్ష లు రాసే కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు ఉండేలా చూడాలన్నారు. ఇన్విజిలేటర్లు ఏమాత్రం పొరపాటు చేసినా, ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. మాస్ మాపీయింగ్ అనే పేరు ఎక్కడా వినిపించరాదన్నారు. పరీక్షల సమయంలో జిరాక్స్ కేంద్రాలు మూసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు వచ్చేలా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. డీఈవో రేణు కాదేవి మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల నిర్వహణలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందో బస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మొబైల్ వాహనాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారా సింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంఈవో వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జైలులో ఖైదీల భోజన వసతులపై ఆరా..

పరిగి సబ్‌జైలును సందర్శించిన జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, జడ్జి శీతల్

పరిగి, మార్చి 19 : పరిగిలోని సబ్‌జైలును బుధవారం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, జడ్జి డీబీ శీతల్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలకు అందుతున్న భోజన వసతులను అడిగి తెలుసుకొన్నారు. వారికి వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. పేద ఖైదీలకు ఉచితంగా బెయిల్ ఇచ్చేందుకు డిఫెన్స్ న్యాయవాదులు వెంకటేశ్, శ్రీనివాస్, గౌస్‌పాషాలకు వివరించి పేద వారికి న్యాయం చేయాలని సూచించారు. అనంతరం పరిగిలోని బాలసదన్‌ను జడ్జి సందర్శించారు. కార్యక్రమంలో పరిగి సబ్‌జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దవాఖాన పరిసరాలు శుభ్రంగా ఉండాలి

పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్, మార్చి 19 : దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భవన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పతిలోని ఔట్ పేషంట్లు, ఇన్‌పేషంట్ల రిజిష్టార్, ల్యాబోరేటరీ, మందుల నిల్వల గదిని పరిశీలించారు. దవాఖానకు వచ్చే రోగులకు సరైన విధంగా వైద్యం అందించాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, మెరుగైన వైద్యం అందించాలన్నారు. మందులు అందుబాటులో పెట్టుకోవాలని తెలిపారు. ఆస్పత్రి గదుల్లో ఫ్యాన్లు, మంచాలు తదితర ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని బీసీ వసతి గృహాన్ని పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట బీసీ వసతి గృహం వార్డెన్ శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ఆహార భద్రత హక్కును హరిస్తే సహించం

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, వసతి గృహం, రేషన్ షాపును తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ బృందం
- విద్యార్థులు, గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచన

కడ్తాల్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 19 : రాజ్యాంగం కల్పించిన ఆహార భద్రత హక్కుకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, జీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గిరిజన వసతి గృహంతోపాటు రేషన్ షాపును ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, జ్యోతితో కలిసి ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని రేషన్ షాపు-18లో ఉన్న బియ్యంతో పాటు స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. షాపునకు నెలకు ఎన్ని కిలోల బియ్యం, చక్కెర వస్తున్నాయి.. మిగులు బియ్యం ఎంత.. అంత్యోదయ కార్డులు ఎన్ని ఉన్నాయి.. తదితర వివరాలు డీలర్‌ను అడిగి వారు తెలుసుకున్నారు. షాపులో చక్కెర స్టాక్ లేకపోవడంతో, అంత్యోదయ కార్డులు ఉన్న వారికి చక్కెర పంపిణీ చేసేందుకు వెంటనే డీడీ కట్టాలని డీలర్‌కు సూచించారు. రేషన్ షాపుల్లో ఫిర్యాదుల పెట్టెతోపాటు జిల్లా అధికారుల ఫోన్ నంబర్లు, స్టాక్‌కు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలిసేలా పట్టికను ఏర్పాటు చేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన..

అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంఖ్య ఎంత, పోషకాహారం పంపిణీ ఎలా జరుగుతుంది, సరుకుల నాణ్యత ఎలా ఉంది తదితర విషయాలను టీచర్లను అడిగి కమిషన్ సభ్యులు తెలుసుకున్నారు. గుడ్ల సైజు చిన్నగా ఉండడంతో పెద్దవి పంపిణీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను వచ్చే వారికి మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని పేర్కొన్నారు.

పాఠశాలలు, వసతి గృహాల పరిశీలన..

అనంతరం కేజీబీవీ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జీఏపీఎస్ పాఠశాల, గిరిజన వసతి గృహాన్ని కమిషన్ సభ్యులు సందర్శించారు. ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు పట్టికలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎన్ని రోజులకోసారి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. మంచి నీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ ఎలా ఉంది తదితర విషయాలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ బాలికల్లో రక్తహీనత ఉన్నదని దానిని అధిగమించేందుకు పోషకాలు ఎక్కువ ఉండే ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో ఏఎన్ఎంను నియమించాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలలో నీటి సమస్య ఉన్నదని ప్రిన్సిపాల్ శ్రీలత కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. పాఠశాల, గిరిజన విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, గిరిజన, మైనార్టీ సంక్షేమ శా ఖ జిల్లా అధికారులు రామేశ్వరిదేవి, నవీన్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ డీసీఎస్‌వో శ్రీనివాస్, మేనేజర్, గోపికృష్ణ, ఏటీడీవో వెంకటయ్య, డీడబ్ల్యూవో సంధ్య, సీడీపీవో శాంతీరే ఖ, డీఆర్‌డీఏ ఏపీడీలు నరేందర్‌రెడ్డి, చరణ్‌గౌతమ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, ఏంఈవో సత్యనారాయణ, ఏపీఏం రాజేశ్వరి, డీటీలు రవీందర్‌నాయక్, భానుప్రకాశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రియల్ విలవిల... ఖజానా వెలవెల

- ట్రిపుల్ ఆర్ వరకు హెచ్ఎండీఏ విస్తరణ జరిగినా.. కేటాయింపులు లేవు

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కుప్పకూలిన రియాల్టీతో హెచ్ఎండీఏ ఖజానా ఖాళీ అవుతుంటే... ప్రభుత్వం నుంచి నిధులేక విలవిల్లాడిపోతున్నది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ సర్కారు చెప్పుకుంటున్నా... ప్రాజెక్టుల నిర్మాణానికి చిల్లి గవ్వ అదనంగా ఇవ్వడం లేదు. గతంలో హెచ్ఎండీఏకు వచ్చే ఆమ్దానీతో వరల్డ్ క్లాస్ నగరానికి అనువైన ప్రాజెక్టులు చేపట్టడంతో పాటు, ఇతర విభాగాల పరిధి నిర్మించే ప్రాజెక్టులకు కూడా ఆర్థిక వనరులను హెచ్ఎండీఏ సమకూర్చితే... ఇప్పుడు సొంత పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక బిల్డింగ్ అనుమతులు, ఇతర అనుమతుల ద్వారా నెలవారీగా వచ్చే ఆదాయం సగానికి పడిపోవడంతో... సమకూరే బడ్జెట్ నిర్వహణకే సరిపోతే చాలనుకునేంత దారుణంగా మారింది. కనీసం ప్రభుత్వమైన భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తుందని భావిస్తే... అత్తెసరు నిధుల కేటాయింపులతో చేతులు దులుపుకొంది. ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులు, లింకు రోడ్లు నిర్మాణం, గ్రీన్ ఫీల్డ్ హైవే, కొత్వాల్‌గూడ ఏకో పార్క్‌తో పాటు నగరంలో రెండో అతి పెద్ద కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టుల కోసం రూ. 5-6వేల కోట్లు వెచ్చిస్తే తప్ప.. పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. కానీ ప్రభుత్వం రూ. 500 కోట్లను బడ్జెట్‌లో కేటాయించి చేతులు దులుపుకొంది. రేవంత్ సర్కార్ కేటాయించిన అరకొర నిధులకు అదనంగా హెచ్ఎండీఏకు గతంలో తరహాలో ఆదాయం పెరిగితే గానీ ఈ ప్రాజెక్టుల నిర్మాణ పనులను మొదలుపెట్టలేరు. ఇక 7200 చదరపు కిలోమీటర్లు ఉన్న హెచ్ఎండీఏ పరిధిని మరో నాలుగు జిల్లాల్లోని 3వేల కిలోమీటర్లకు విస్తరించినా ఆ స్థాయి నిధులివ్వలేదు. కనీసం పెరిగిన పరిధికి అనుగుణంగా నిర్వహణ ఖర్చులకు అయ్యే రూ. 30 కోట్లు కూడా బడ్జెట్‌లో చూపలేదు.

చేతి నిండా ప్రాజెక్టులే...

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో హెచ్ఎండీఏ కీలక పాత్రను పోషిస్తోంది. కొత్తగా పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా 10 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించిందనే గొప్పలు చెప్పుకోవడమే తప్ప.. విస్తరణకు అనుగుణంగా హెచ్ఎండీఏ పరిధిలో మౌలిక వసతులకు అవసరమైన నిధులు లేకపోవడంతో... అభివృద్ధి కుంటు పడే అవకాశమే కనిపిస్తోంది. కనీసం సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్టులన్నీ శంకుస్థాపన చేసిన 18 కిలోమీటర్ల రెండు ఎలివేటెడ్ మార్గాలు, 7 కి.మీల మీరాలం కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టులకైనా ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. దీంతో అటు ఆమ్దానీ లేక, ఇటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందక, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల భవిత అగమ్యగోచరంగా మారింది. రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ఏడాది పూర్తయినా.. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయలేకపోయారు. ఇలా చేతి నిండా ప్రాజెక్టులు ఉన్నా... ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకాలు లేకపోవడంతో, ఏటా ఓఆర్ఆర్ ప్రాజెక్టు కోసం బ్యాంకులకు ఇచ్చే యాన్యుటీ చెల్లింపులకే ప్రభుత్వం ఇచ్చే రూ. 500 కోట్లు సరిపోయే పరిస్థితి నెలకొని ఉంది. ఇలా పరిధి పెంచి ఉత్సాహం నింపిన హెచ్ఎండీఏకు... ప్రభుత్వం నిధులు కేటాయించకుండా నిర్జీవంలా మార్చుతుందనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది కూడా రూ. 500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా అదనంగా విడుదల చేయలేదు. కేటాయించిన నిధుల నుంచే కోత విధించడంతో కాంగ్రెస్ ఏడాది పాలనలోనే మహా హైదరాబాద్ ఆర్థికంగా చితికిపోతుందనే ఆరోపణలు వస్తున్నాయి.

అప్పుల కోసం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే...

ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టనున్న ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ. 23వేల కోట్లు అవుతుందనే అంచనాలు ఉన్నాయి. తాజా బడ్జెట్‌పై గంపెడాశలతో ఉన్న అధికారులకు ప్రభుత్వం రిక్తహస్తమే చూపి, అప్పుల కోసం హెచ్ఎండీఏను ప్రేరేపితం చేసింది. ఇప్పటికే నిధులను సమకూర్చుకునే క్రమంలో హెచ్ఎండీఏ ఆస్తులను తనాఖా పెట్టేందుకు సిద్ధంగా ఇందుకోసం ఏజెన్సీలను కూడా నియమించుకుంది. దీంతో బడ్జెట్ ఆశలు నీరుగారిపోవడంతో ఆస్తుల ద్వారా నిధులను సమకూరితే తప్ప.. హెచ్ఎండీఏ పరిధిలో అభివృద్ధి పనులకు ఆస్కారమే లేకుండా పోయింది.

ఆశలకు రూ.18వేల వేతనం చెల్లించాలి

- ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత
- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా
- రంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట ధ